క్లుప్తంగా

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



నందిగామ: స్థానిక నెహ్రూనగర్‌లోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిగింది. కల్యాణ వేడుకల్లో పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండు వేసవిలో నిండుగా సాగర్ కాల్వ



వత్సవాయి: మండు వేసవిలో సాగర్ కాల్వ నిండుగా నీరు పారుతోంది. మొక్కజొన్న పంటతో పాటు మూగజీవాలకు సాగర్ నీరు పుష్కలంగా దొరుకుతోంది. గ్రామాల్లోని చెరువులను నింపుకుంటున్నారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి బావులు, బోర్లలో నీటి ఊట పెరుగుతోంది.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ నిత్యాన్నదానానికి ఓ భక్తుడు విరాళమందించారు. ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన మాచవరం సాయితేజ ఉన్నత చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్తూ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి రూ.10,116 విరాళాన్ని ఆలయ అధికారుల చేతుల మీదుగా అందజేశారు. అధికారులు దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

ఈదురుగాలులు..

విద్యుత్ సరఫరాలో అంతరాయం



జగ్గయ్యపేట: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి వీచిన ఈదురుగాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మూడు గంటల పాటు ఉరుములతో పాటు గాలులు వీయడంతో మామిడి కాయలు రాలాయి. చిల్లకల్లు, తిరుమలగిరి, ఆటోనగర్ ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగడంతో శనివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ తారాచంద్ సిబ్బందితో కలిసి విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు.

గురు విశ్వస్ఫూర్తికి నివాళులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో గురు విశ్వస్ఫూర్తి చిత్రపటం వద్ద భక్తులు శనివారం సాయంత్రం ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల విశ్వస్ఫూర్తి శివైక్యం చెందడంతో గ్రామంలోని స్ఫూర్తిధాము వద్ద ఆయన చిత్రపటానికి భక్తులు పూలమాలు వేసి సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పీఎస్‌ను సందర్శించిన డీసీపీ



డీసీపీ అజితకు స్వాగతం పలుకుతున్న ఏసీపీ, సీఐ, ఎస్‌ఐలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌ను శనివారం డీసీపీ డాక్టర్ వి.అజిత సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల వివరాలను తనిఖీ చేసి స్థానిక పరిస్థితులపై సమీక్షించారు. నందిగామ ఏసీపీ నాగేశ్వరరెడ్డి, సీఐ నాగమురళి, ఎస్‌ఐ బి.వి. రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



బలుసుపాడు రోడ్డులోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ఉదయభాను



ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట అర్బన్: రంజాన్ పర్వదిన వేడుకలను పట్టణంలోని ముస్లింలు శనివారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ముస్లింలు తెల్లవారుజామునే 5 గంటలకు ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరికొకరు సేమ్యా పాయసాలను అందజేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బలుసుపాడు రోడ్డులోని చారిత్రక ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముఫ్తి ఖాజా మొయినుద్దీన్ రంజాన్ సందేశం ఇచ్చారు. ప్రజలు సుఖసంతోషాలతో సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు.

విప్ ఉదయభాను ప్రార్థనలు

ఈద్గాలో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు. అనంతరం ఉదయభాను మతపెద్ద ముఫ్తి ఖాజామొయినుద్దీన్, పలువురు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ మాజీ చైర్మన్ మహ్మద్ అక్బర్, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు, ఈద్గా కమిటీ ప్రెసిడెంట్ షేక్ మొహిద్దీన్, జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ జలీల్, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ ఎక్బైడ్ బాషా, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పఠాన్ అక్బర్‌ఖాన్, ఈద్గా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి: వత్సవాయి, చిట్టేల, దబ్బాకుపల్లి, తాళ్లూరు, భీమవరం, మక్కపేట, కంభంపాడు, పోలంపల్లిలో అత్యంత వైభవంగా రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

పెనుగంచిప్రోలు: స్థానిక పురాతన జుమ్మా మసీదులో పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని అనిగండ్లపాడు, కొణకంచి, నవాబుపేట, ముండ్లపాడు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నందిగామలో..

నందిగామ: నందిగామ పట్టణంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో మసీదులు, ఈద్గాలకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. అశోక్ నగర్‌లోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. మత గురువు ఖురాన్‌ను పఠించి దేవుడితో నడుచుకోవాల్సిన విధానాన్ని వివరించారు. ప్రార్థనల తర్వాత పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పండుగ సందర్భంగా ఎవరికి తోచినంత వారు దానధర్మాలు చేశారు. మండలంలోని మాగల్లు, రామిరెడ్డిపల్లి, రుద్రవరం, పెద్దవరం గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

– నందిగామ నియోజకవర్గ పరిధిలోని ముస్లింలకు ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉదయాన్నే ఈద్గా వద్దకు చేరుకొని ముస్లింలను ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

కంచికచర్ల: మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెండ్యాల, చెవిటికల్లు, గణాత్కూరు, గొట్టుముక్కల, మొగులూరులోని మసీదుల్లో మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చందర్లపాడు: చందర్లపాడుతోపాటు పలు గ్రామాల్లో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

వీరులపాడు: జుజ్జూరు గ్రామంలోని మదీనా మసీదులో మత గురువు మౌలానా రెహమాన్ ఆధ్వర్యాన తెల్లవారు జాము నుంచే ప్రత్యేక నమాజ్‌లు చేశారు. మండలంలోని నరసింహారావుపాలెం, వీరులపాడు, అల్లూరు, కొణతాలపల్లి గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జగ్గయ్యపేట: మండలంలో గౌరవరంలోని ఈద్గాలో ముస్లింలు నమాజ్‌లు చేశారు. ముక్త్యాల, షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మత పెద్దలు బడేమియా, పఠాన్ మహ్మద్ ఖాన్, షేక్ మీరా పఠాన్, సయ్యద్ బాలసైదా, బుడే ఖాజావలి, తదితతరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: రంజాన్ పండుగ వేడుకలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి ముస్లింలకు, సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు ఇ.రాంబాబు, షేక్ హుస్సేన్, ఇస్మాయిల్, మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.



ఈద్గా వద్ద ముస్లింలు



పెనుగంచిప్రోలులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పేట తహసీల్దార్ కార్యాలయంలో..



తాళ్లూరులో ముస్లింల ప్రార్థనలు



జుజ్జూరులో ముస్లింల ప్రార్థనలు

74 సెంట్లలో షాదీఖానా నిర్మాణం

ప్రభుత్వ విప్ ఉదయభాను



ముస్లింలు, మత పెద్దలకు షాదీఖానా స్థలం మంజూరు ఆర్డర్ కాపీని చూపిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: నియోజకవర్గంలోని మూడు మండలాల ముస్లింల వివాహాది శుభకార్యాల సౌకర్యార్థం పట్టణంలోని కోదాడ రోడ్డులో 74 సెంట్ల సువిశాల స్థలంలో షాదీఖానా నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ సందర్భంగా బలుసుపాడు రోడ్డులోని ఈద్గాలో శనివారం జరిగిన రంజాన్ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు కానుకగా షాదీఖానా నిర్మాణానికి స్థలం మంజూరు చేయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ముస్లింలు శుభకార్యాలు చేసుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బంది పడుతున్నారని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. జాతీయ రహదారికి అతి సమీపంలో కోదాడ రోడ్డు పక్కనే సుమారు 74 సెంట్ల స్థలాన్ని కేటాయించి ప్రభుత్వం ద్వారా వచ్చిన స్థలం మంజూరు పత్రాన్ని కమిటీ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. త్వరలో షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఉదయభాను తెలిపారు. అనంతరం ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఈద్గా కమిటీ ప్రెసిడెంట్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ జలీల్, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ ఎక్బైడ్ బాషా, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

- వైస్ ఎంపీపీ సొంత ఖర్చుతో ఈద్గా నిర్మాణం
- ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జుజ్జూరులో ఈద్గాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): ముస్లింల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరులో నిర్మించిన ఈద్గా, గ్రౌండ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ రూ. ఐదు లక్షల సొంత ఖర్చుతో వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా ఈద్గా నిర్మించడం అభినందనీయమన్నారు. పవిత్ర రంజాన్ పండుగ రోజు ముస్లిం సోదరులతో కలిసి ఈద్గా ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు ముస్లింలను విస్మరిస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూల రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు జయాలుద్దీన్, గౌసియా జామా మసీదు ప్రెసిడెంట్ చిన్న మీరాహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో పారదర్శక పాలన

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఏటూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సచివాలయాలతో పారదర్శక పాలన అందిస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ఏటూరులో నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రూ. 40 లక్షల వ్యయ అంచనాతో సచివాలయ భవనం, రూ. 17.50 లక్షల వ్యయ అంచనాతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారన్నారు. పల్లెల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడ్డారని నేడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, పాల వెల్లువ తదితర సదుపాయాలు కల్పిస్తూ గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల ఇళ్ల ముంగిటే పాలన అందిస్తున్నారని కొనియాడారు. మంచి మనసున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వేణు, పాలేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా జైనుల శోభాయాత్ర

వైభవంగా వర్షితప్ ముగింపు ఉత్సవం



జైన గురువు అభినందన్‌చంద్ర సాగర్‌కు స్వాగతం పలుకుతున్న సంఘం కార్యదర్శి పన్నాలాల్‌జైన్



ఉపవాసదీక్షలు ఆచరించిన జైనులను వాహనాల్లో ఊరేగిస్తున్న కుటుంబ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైనుల వర్షితప్ ముగింపు ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఏడాది పాటు నిర్విరామంగా కొనసాగించిన వర్షితప్ దీక్షల ముగింపు కార్యక్రమాన్ని జైన సంఘాల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నగరంలో నిర్వహించారు. పాతబస్తీలోని శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్ ఆధ్వర్యంలో రెండు రోజుల ఉత్సవాన్ని స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జైనులు ఉపవాసదీక్షలను ఆచరించిన వందలాది మంది వ్యక్తులను వివిధ వాహనాల్లో ఊరేగిస్తూ నగరంలో భారీ శోభయాత్ర నిర్వహించారు. ఏ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్ వరకూ ఈ శోభయాత్ర జరిగింది. నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సంఘ్ అధికార ప్రతినిధి ప్రవీణ్ రాంకా మాట్లాడుతూ జైన సంప్రదాయంలో ఏడాది పాటు కొనసాగించే ఉపవాసదీక్షను వర్షితప్‌గా పిలుస్తారని చెప్పారు. ఈ దీక్షలో ఒక రోజు ఆహారాన్ని స్వీకరిస్తే మరుసటి రోజు పూర్తిగా ఉపవాసాన్ని ఆచరిస్తారన్నారు. ఏడాది పొడవునా దీక్షను కొనసాగించి అక్షయతృతీయ రోజును విరమిస్తారన్నారు. ఈ ఏడాది నగరంలోని సుమారు 250 కుటుంబాల నుంచి సభ్యులు దీక్షను ఆచరించారన్నారు. వారి దీక్ష విరమణ సందర్భంగా బంధువులు, నగరంలోని వేలాది మంది జైనులతో సామూహికంగా వర్షితప్ ముగింపు ఉత్సవాన్ని వైభవంగా జరుపుతున్నామన్నారు. రెండు రోజుల ఉత్సవానికి పది వేల మంది జైనులు హాజరవుతున్నట్లు వివరించారు. రెండు ప్రాంగణాల్లో శని, ఆదివారాల్లో వివిధ కార్యక్రమాలుంటాయన్నారు.

ఉపవాసదీక్ష సమాజాన్ని సంస్కరిస్తుంది..

ఉపవాసదీక్షలు సమాజాన్ని సంస్కరిస్తాయని ప్రముఖ జైన గురువు పరమపూజ్య అభినందన్ చంద్రసాగర్ అన్నారు. వర్షితప్ ముగింపు ఉత్సవానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. జైన తీర్థంకురులలో మొదటివారైన ఆదినాథ్ ప్రభుజీ స్వయంగా ఉపవాసదీక్షను ఆచరించి జైనులకు ప్రబోధించారన్నారు. ఉపవాసదీక్షలతో సమాజంలోని ఆకలిదప్పికలు తెలుస్తాయన్నారు. తద్వారా ఎవరూ ఆకలితో ఉండకూడదనే భావన పెరిగి సమాజంలో చక్కని శాంతి సమానత్వాలు వర్ధిల్లుతాయన్నారు. జైనం ఈ సందేశాన్ని ప్రపంచానికి బోధిస్తుందని వివరించారు. సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ బోడోతరియా, ప్రధాన కార్యదర్శి పన్నాలాల్ జైన్ ఉపాధ్యక్షుడు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, సహాయక కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగరమల్ జైన్, సహ కోశాధికారి రాహుల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టిన నాటకాలు



ప్రక్షాళనం నాటకంలోని రసవత్తర సన్నివేశం



రంగస్థల ప్రముఖుడు ఎంఎస్ చౌదరికి ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఎస్వీఆర్ కళాకేంద్రం, కొడాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ ఆహ్వాన నాటకల ప్రదర్శనలు సమాజంలో నేడు జరుగుతున్న వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టాయి. శనివారం నాటి ప్రదర్శనలలో తొలి నాటకంగా రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనకు ఎంఎస్ చౌదరి దర్శకత్వం వహించిన పిపీలకం నాటకం ప్రదర్శించారు. మానవుడు సంఘజీవి అతని జీవితం సంఘంతోనే ముడిపడి ఉంటుంది. సంఘంతో అన్ని రంగాలతోపాటు పేదలు, బడుగు బలహీన వర్గాల వారు ఉంటారు. బలవంతుడు బలహీనులను అణచివేయాలే ప్రయత్నం చేస్తాడు. వారిని ఎదిరించి తమ ఉనికిని కాపాడుకోవడమే నాటక ఇతి వృత్తం. ఇందులో చీమలను ప్రధాన పాత్రగా చేయడం, అందరూ యువకులే నటించడం విశేషం. రెండవ నాటికగా చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించిన ప్రక్షాళన నాటకం ప్రదర్శించారు. మన దేశంలో రోజు రోజుకూ ఆడవారిపై అత్యాచారాలు జరుగుతున్నాయి.. హత్యలు పేట్రేగిపోతున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజ స్వరూపమే మారిపోయింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల టెక్నాలజీని అడ్డం పెట్టుకొని యువత దారి తప్పుతోంది. సమాజాన్ని ప్రక్షాళన చేయాలనే సందేశంతో నాటకం సాగింది. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఎందరో యువ నటీనటులను తయారు చేసి వారిని నాటక రంగం వైపు మళ్లించిన దర్శకుడు ఎంఎస్ చౌదరికి ఎన్టీఆర్ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా ప్రారంభించారు. తెలుగు నాటక రంగంలో వస్తున్న మార్పులు అంశంగా ప్రసంగించారు. వివిధ రంగాలకు చెందిన అంబటి మధుమోహన కృష్ణ, దొంతాల ప్రకాష్, అరెకపూడి రామకృష్ణ చౌదరి, దేవినేని కిషోర్‌కుమార్, తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా చిన్నారి పి.మహతి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

చండీ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం



విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నైనవరం ఫ్లై ఓవర్ సమీపంలో ఈ నెల 27వ తేదీ నుంచి మే 3వ వరకు నిర్వహిస్తున్న సహస్ర చండీ యాగ పూర్వక కుంభాభిషేకానికి ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఫ్లై ఓవర్ దిగువన నిర్మించిన యాగశాల వద్ద 72 అడుగుల అష్టభుజ మహా చండీ విగ్రహ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహ నిర్మాణ పనులను గజల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, పీఠాధిపతి కరుమారి దాసు, లక్కంరాజు సునీత పరిశీలించారు. కరుమారి అమ్మన్ శక్తిపీఠం వద్ద నిర్వహిస్తున్న సహస్ర చండీ యాగానికి ప్రతి ఒక్కరూ విచ్చేసి వీక్షించవచ్చన్నారు. యాగానికి పలువురు మంత్రులతో పాటు ఆధ్యాత్మిక వేత్తలు, పీఠాధిపతులు విచ్చేయనున్నారని పేర్కొన్నారు. పీఠం కోశాధికారి జ్ఞానేశ్వర్, సత్య శ్రీహరి, శంకరరెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మీ యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద యాగశాలలో ఉదయం 9 గంటలకు యాగం ప్రారంభమవుతుందన్నారు. రూ.వెయ్యి టికెటు కొనుగోలు చేసిన భక్తులు ఈ యాగంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు.

రైతులను ఆదుకోండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: పులిచింతల గేటును నిర్మించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రైతు సంఘ నాయకులతో కలిసి శనివారం పులిచింతల ప్రాజెక్టును సందర్శించిన ఆయన జగ్గయ్యపేట డీవీఆర్ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఖర్చు చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కేశవరావు, కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, పార్టీ పేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి తదితరులు పాల్గొన్నారు.